క్లుప్తంగా

ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం



రాయపర్తి (వర్ధన్నపేట) : వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలను వర్ధన్నపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం వేలం వేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ స్వరూప మాట్లాడారు. మొత్తం 21 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, ఒక కారుకు వేలం నిర్వహించగా ప్రభుత్వానికి రూ.2,82,900 ఆదాయం సమకూరిందని చెప్పారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అభినందన



పర్వతగిరి : వరంగల్ ఎంపీగా కడియం కావ్య ఎంపికైన నేపథ్యంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఎంపీడీఓ శంకర్ నాయక్‌తోపాటు పలువురు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీఓ పాక శ్రీనివాస్, ఏపీఓ సుశీల కుమార్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ అయేషా పర్వీన్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, కార్యాలయ ఉద్యోగి రాంప్రసాద్ ఉన్నారు.

ఎంపీ కావ్యకు..



పర్వతగిరి : వరంగల్ ఎంపీగా గెలిచిన నేపథ్యంలో డాక్టర్ కడియం కావ్యను యూత్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరి దిలీప్‌గౌడ్, కార్యదర్శి బొక్కల ప్రమోద్, నాయకులు రాజేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నివాళి



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త బండారి లక్ష్మణ్ గురువారం గుండెపోటుతో మృతి చెందగా ఆయన మృతదేహానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం అందించి అంత్యక్రియలకు హాజరయ్యారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, పెండ్యాల మమత రాజు, బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్‌రెడ్డి, నాయకులు పొన్నం మొగిలి, సుకినె రాజేశ్వర్‌రావు, శానబోయిన రాజుకుమార్, కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, ఓడేటి తిరుపతిరెడ్డి, జంగా రాజిరెడ్డి, నాగరబోయిన మోహన్, జంగా రంగారెడ్డి, మట్ట రాజు, పుచ్చకాయల బుచ్చిరెడ్డి, మాదాసి సాంబయ్య, తదితరులున్నారు.

మొరిపిరాలలో..

రాయపర్తి : మండలంలోని మొరిపిరాల గ్రామ మాజీ సర్పంచ్ అల్లెడ్డి యాదమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందగా ఆమె మృతదేహానికి బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, జిల్లా నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు శుక్రవారం నివాళులర్పించారు. అనంతరం యాదమ్మ కుమారుడైన బీఆర్‌ఎస్ నాయకుడు యాకూబ్‌రెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు పారుపల్లి సుధాకర్‌రెడ్డి, అష్రఫ్ పాషా, చిలువేరు సాయి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఐనవోలు : బీర, కాకర, సోరకాయ పంటలను సాగుచేసే రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ (సీఐపీఎంసీ) అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు డాక్టర్ శ్వేతా సర్వార్, డాక్టర్ సుధా సూచించారు. మండలంలోని పంథిని గ్రామంలో ఉద్యానశాఖ అధికారి మానసతో కలిసి వారు ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తీగజాతి విత్తనాలను ట్రైకోడర్మా విరిడితో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసి నాటుకోవాలని తెలిపారు. అలాగే రసం పీల్చే పురుగులను అరికట్టేందుకు పసుపు, నీలం జిగురు అట్టలను, సోలార్ లైట్ ట్రాప్‌లను అమర్చుకోవాలన్నారు. వేపనూనె 5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు.

పర్వతగిరి సంత.. జనానికి చింత

- తాగునీటి, విద్యుత్, ట్రాఫిక్ సమస్యలతో సతమతం



రోడ్డుపైనే ఏర్పాటు చేసిన సంత

పర్వతగిరి : పర్వతగిరి సంత.. జనానికి చింత.. ఆదాయం ఘనం.. అయినా వసతులు శూన్యం.. అన్న వ్యాఖ్యలు సర్వత్రా వినవస్తున్నాయి. మండల కేంద్రంలో దశాబ్దాల క్రితం ఏర్పాటైన సంత (అంగడి)కి వచ్చే వారి సంఖ్య నానాటికీ పెరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఏటా సుమారు రూ.6 లక్షల ఆదాయం సమకూర్చుతున్నా అంగడిలో విద్యుత్, తాగునీటి, ట్రాఫిక్ సమస్య వెంటాడుతున్నాయి. పర్వతగిరి–నెక్కొండ ప్రధాన రహదారిపై ఏర్పాటైన అంగడి నిత్యం ట్రాఫిక్ సమస్యలకు లోనవుతోంది. ప్రతీ సోమవారం నిర్వహించే అంగడి వ్యాపారస్తులకు సరైన స్థలం లేక రోడ్డు మీదే కొందరు, రోడ్డు పక్కన ఇంకొందరు వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కోసారి సుమారు గంటకుపైగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఫలితంగా ప్రజలు, వ్యాపారస్తులు అవస్థల పాలవుతున్న దుస్థితి నెలకొంది. మండలంలో 33 గ్రామ పంచాయతీల పరిధిలో ఒకే సంత ఉండడంతో పర్వతగిరి అంగడికి ప్రజల రాక భారీ సంఖ్యలో ఉంటోంది. గతంలో మహిళలు కూరగాయలు పండించగా కోతుల బెడదతో వదిలేశారు. ఫలితంగా మహిళలందరూ సంతకు వెళ్లి కూరగాయలు తెచ్చుకోక తప్పడం లేదు. ఈ క్రమంలో సంత చిన్నదిగా ఉండి కొనుగోలుదారుల, వ్యాపారుల సంఖ్య పెరగడంతో వాహనదార్లు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ట్రాఫిక్ ఇబ్బంది నివారించాలి



ప్రతీ సోమవారం నిర్వహించే అంగడిలో సాయంత్రం వేళలో ఎక్కువగా రద్దీ ఉంటోంది. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ట్రాఫిక్ రద్దీ తీవ్రత కనపడుతోంది. ట్రాఫిక్ సమస్య నివారించే దిశగా గ్రామ పంచాయతీ అధికారులు చొరవ చూపాలి. విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలి.

–బొట్ల ప్రభాకర్, పర్వతగిరి

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం



అంగడి చిన్నదిగా ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. అంగడిని వేరే చోటకు మార్చాలా? అదే స్థలంలో విస్తరించాలా? అనే విషయమై అధ్యయనం చేస్తున్నాం. కొనుగోలుదారులకు, విక్రేతలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతాం.

-రఘు, గ్రామ పంచాయతీ కార్యదర్శి

మహిళల కోలాటంతో సందడి



కోలాటం ఆడుతున్న మహిళలు

సంగెం : మండలంలోని తీగరాజుపల్లికి చెందిన శ్రీరాజరాజేశ్వర మహిళా కోలాట బృందం శుక్రవారం ప్రదర్శించిన దాండియా కోలాటంతో సందడి నెలకొంది. కోలాటం ఆహూతులనను ఆకట్టుకుంది. యాదాద్రి దేవస్థానం తరఫున దోని రంజీత్ నేతృత్వంలో ఇటుకాల అమల ఆధ్వర్యంలో 20 మంది మహిళలు వారం రోజులపాటు శ్రద్ధగా కోలాటం నేర్చుకుని గ్రామంలో శుక్రవారం సాయంత్రం ప్రదర్శించారు. ఈ సందర్భంగా శిక్షకుడు రంజీత్ మాట్లాడారు. కోలాట బృందం సభ్యులు అన్నవరం, సింహాచలం, తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీశైలం, యాదాద్రి తదితర పుణ్యక్షేత్రాల్లో ప్రదర్శనలు ఇస్తారని తెలిపారు. గ్రామంలోని మహిళలు కోలాటం నేర్చుకునేందుకు ఉత్సాహం చూపడం అభినందనీయమని చెప్పారు. సభ్యులకు గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. దేవస్థానాల్లో ప్రదర్శనలు ఇవ్వడంతోపాటు గ్రామాల్లో జాతరలు, ఉత్సవాలు జరిగినప్పుడు బృందం ప్రదర్శనలు ఇస్తుందని వివరించారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యార్థులతో వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి సోమయ్య, తదితరులు

రాయపర్తి (వర్ధన్నపేట) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి సోమయ్య ఆకాంక్షించారు. మండలంలోని దమ్మన్నపేటలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం పంపించిన యూనిఫారాలు, నోట్‌బుక్కులను శుక్రవారం వైస్ ఎంపీపీ పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేలా ప్రణాళికాయుతంగా చదవాలని చెప్పారు. అనంతరం హెచ్‌ఎం బి.మహేశ్‌నాయక్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా యూనిఫారాలు, నోట్‌బుక్స్, తదితరాలు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పాలని కోరారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బండ రమేశ్, ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, కవిత, సరస్వతి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ హైమ పాల్గొన్నారు.

ఆశలకు ఆన్‌లైన్ పరీక్ష సరికాదు

- నేడు కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా



వినతిపత్రం ఇస్తున్న యువరాజు, తదితరులు

నర్సంపేట : ఆశావర్కర్లకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించాలని నిర్ణయించడం సరికాదని ఆశావర్కర్ల (బీఆర్‌టీయూ అనుబంధ) సంఘం జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండారి మంజుల అన్నారు. సమస్యల పరిష్కారం కోసం నేడు (శనివారం) హైదరాబాద్‌లోని వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆశావర్కర్లకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్‌ఐఓఎస్) పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని లేదా రాతపూర్వకంగా నిర్వహించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ డీఎంహెచ్‌ఓలు వెంకటరమణ, సాంబశివరావులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం యువరాజు, మంజుల మాట్లాడారు. సుమారు 18 ఏళ్ల క్రితం ఆశావర్కర్‌గా పని చేయడానికి ఎవరూ ముందుకు రాకపోతే ఏడో తరగతి చదివితే చాలని చెప్పి 40 రోజులు శిక్షణ ఇచ్చి ఆశావర్కర్లను నియమించారని గుర్తు చేశారు. నాటి నుంచి అన్ని రకాల విధులను సమర్థవంతంగా నిర్వహిస్తుండగా ఇప్పుడు కొత్తగా కంప్యూటర్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించడానికి నిర్ణయించడం తగదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆశావర్కర్లకు ప్రతీనెల 1న పారితోషికాలు అందగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీనెల పెండింగ్‌లో ఉంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. ఆశావర్కర్ల పారితోషకాన్ని రూ.18 వేలకు పెంచి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నేటి ధర్నాను విజయవంతం చేయాలని ఆశావర్కర్లను కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కాల్వల లలిత, తడుగుల సంధ్య, మామిడాల రమ, విజయ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోండి

నల్లబెల్లి : అర్హులు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలని ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ ఏఈ శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జీరో బిల్ రాని అర్హులు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని సూచించారు. సెల్ నంబర్‌తోపాటు ఫుడ్ సెక్యూరిటీ కార్డు, ఆధార్ కార్డు, కరెంటు బిల్లు, ప్రజాపాలన దరఖాస్తు రశీదు జిరాక్స్‌లు అధికారులకు అందించాలని పేర్కొన్నారు.

మట్టి తరలింపు అడ్డగింత



రాయపర్తి (వర్ధన్నపేట): వర్ధన్నపేట శివారులోని అక్కకుంట నుంచి మట్టి తరలిస్తుండగా అంబేడ్కర్ నగర్ గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. మట్టిని తరలించడాన్ని నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని సమీక్షించారు. మట్టి తరలింపునకు అనుమతి ఉండడంతో అడ్డుకోవద్దని గ్రామస్తులకు ఎస్సై సూచించారు. అయినా గ్రామస్తుల తీర్మానం అయ్యాకే తరలించాలని, అప్పటి వరకు తరలించొద్దని గ్రామస్తులు భీష్మించడంతో మట్టి తరలింపును నిలిపివేశారు. అలాగే వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లిలోని ఎల్లమ్మ చెరువు నుంచి మట్టిని తరలించేందుకు ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు.

‘ప్రైవేట్’ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న రాజుగౌడ్, తదితరులు

నర్సంపేట : ప్రైవేట్ స్కూళ్లలో పని చేస్తున్న డ్రైవర్ల, క్లీనర్ల వేతనాలు పెంచడంతోపాటు వారి పిల్లలకు ఉచిత విద్య, పుస్తకాలను అందించాలని ప్రైవేటు పాఠశాలల డ్రైవర్స్, క్లీనర్స్ యూనియన్ అధ్యక్షుడు నాలం రాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో వడుప్సా అధ్యక్షుడికి, పలు పాఠశాలల యాజమాన్యాలకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజుగౌడ్ మాట్లాడారు. ప్రైవేటు స్కూళ్లలో పని చేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబాలను పోషించడం పెను భారంగా మారిందని ఆందోళన వెలిబుచ్చారు. యాజమాన్యాలు స్పందించి కార్మిక చట్ట ప్రకారం డ్రైవర్లకు, క్లీనర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వనపర్తి భిక్షపతి, ఉపాధ్యక్షులు బొల్లెపల్లి నగేశ్ గౌడ్, లక్కరాజు, పెంతల నాగరాజు, కోశాధికారి ఎర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



సాంబయ్య (ఫైల్)

దుగ్గొండి : మండలంలోని పొనకల్ మాజీ సర్పంచ్ ఇటికాల సాంబయ్య (60) గుండెపోటుతో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఉదయం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఇంటికి వచ్చిన ఆయన ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సాంబయ్య గుండెపోటుకు గురైనట్టు వైద్యులు నిర్ధారించారు. సాంబయ్య సర్పంచ్ 2006 నుంచి 2011 వరకు గ్రామాభివృద్ధికి పాటుపడ్డారని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. బాధిత కుటుంబాన్ని పలువురు పరామర్శించారు.

చే గువేరా స్ఫూర్తిని కొనసాగించాలి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట : ప్రపంచ విప్లవకారుడుగా చరిత్రలో నిలిచిపోయిన చే గువేరా అందించిన స్ఫూర్తిని యువత కొనసాగించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు కొత్తకొండ రాజమౌళి, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్, డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు కోరారు. పట్టణంలో చే గువేరా 96వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజమౌళి, రమేశ్, నాగరాజు మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో శాంతి, సౌభ్రాతృత్వం కోసం చే గువేరా జీవితాన్ని త్యాగం చేశారని తెలిపారు. చే గువేరాను స్ఫూర్తిగా తీసుకొని సమసమాజ స్థాపనకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కమిటీ సభ్యులు రాకేశ్, అజయ్, అజిత్ పాల్గొన్నారు.

సన్మానం

దుగ్గొండి : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన యూత్ ఫర్ స్వచ్ఛ్ దుగ్గొండి వ్యవస్థాపకుడు, బ్లడ్ డొనేషన్ మోటివేటర్ శానబోయిన రాజ్‌కుమార్‌ను హనుమకొండలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. సుమారు పదేళ్లుగా రెండు వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి ఎంజీఎం, రెడ్‌క్రాస్ సొసైటీలకు అందించి ఎంతో మందికి ప్రాణదానం చేసినట్లు తెలిపారు. రక్తదానానికి ముందుకొచ్చిన యూత్ ఫర్ స్వచ్ఛ్ దుగ్గొండి బాధ్యులకు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు, మండల యువతకు కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి



రాయపర్తి : కొండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు

రాయపర్తి : రెండున్నరేళ్ల వయస్సు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండూరులో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పిల్లలకు పౌష్టికాహారంతోపాటు చదువు అందిస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించేలా బడిబాట నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తల్లులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న పౌష్టికాహారాన్ని, ఇతర అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిర్ర ఉపేంద్ర, హైస్కూల్ హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, ప్రేమలీల, స్రవంతి, హెల్పర్లు యాకమ్మ, సుల్తానా బేగమ్, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.



పర్వతగిరిలో..

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

పర్వతగిరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని మాజీ సర్పంచ్ ఇస్లావత్ రమేశ్ నాయక్ తెలిపారు. మండలంలోని ఇస్లావత్‌తండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్ల మాధ్యమంలో బోధన, డ్రెస్, బుక్స్, మధ్యాహ్న భోజనం, ఇతర సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలను చేర్పించి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులపై ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుగుణ, ఇస్లావత్ సునీత పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి




వినతిపత్రం అందజేస్తున్న రమేశ్, నాయకులు

నల్లబెల్లి : విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్, నర్సంపేట డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్, నాగరాజు మాట్లాడారు. పలు ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టారీతిన భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రయివేట్ స్కూళ్లలో యూనిఫామ్స్, పుస్తకాలు విక్రయిస్తున్నారని చెప్పారు. మౌలిక వసతులు సైతం సరిగా లేవన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజిత్, వంశీ, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన కాట ఎల్లమ్మ (84) అనారోగ్యంతో బాధ పడుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ జక్క అశోక్ పరామర్శించారు. తొలుత ఎల్లమ్మ మృతదేహానికి మాజీ ఎంపీపీ నివాళులర్పించి బాధిత కుటుంబానికి రూ.2,500 సాయం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఎస్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేశ్, నాయకులు మేరుగు బాబు, యాట సుధాకర్, కాట కుమారస్వామి, సొసైటీ డైరెక్టర్ దొంతరబోయిన కొమ్మాలు, భిక్షపతి తదితరులున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



బోర్‌ను ప్రారంభిస్తున్న ఎల్లాగౌడ్, తదితరులు

ఖానాపురం : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్, ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళీ తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంజూరు చేసిన నిధులతో మండలంలోని బుధరావుపేట శివారులోని స్మశాన వాటిక వద్ద ఏర్పాటు చేసిన బోర్‌ను శుక్రవారం ఎల్లాగౌడ్, లింగమ్మ మురళీ ప్రారంభించి మాట్లాడారు. స్మశాన వాటిక వద్ద నీటి సౌకర్యం కోసం బోర్ వేయించినట్టు తెలిపారు. ప్రజలకు అవసరమైన ఇతర సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్‌రావు, రమేశ్, ప్రభాకర్, పాషా, రామారావు, యాకూబ్, రాకేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

దామెర : ఈనెల 19 నుంచి 21 వరకు వరంగల్ గ్రీన్‌సిటీ సమీపంలో తలపెట్టిన సాంస్కృతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ప్రజానాట్య మండలి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దామెర విజయ్‌కుమార్ (కృష్ణ) కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. యువతలో కళా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు పాటలు, కోలాటం, డప్పు, పల్లెకళలు, నృత్య రూపకాలపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

కారు అదుపు తప్పి వాహనాలు ధ్వంసం



దుగ్గొండి : కారు అదుపు తప్పగా రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నడుపుతున్న కారు అదుపుతప్పి జనావాసాల్లోకి దూసుకెళ్లింది. మినీ బ్యాంక్‌పైకి దూసుకెళ్లి పక్కన ఉన్న ప్రహరీని ఢీకొట్టింది. ఈ క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఎలాంటి ప్రాణహానీ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్సై జక్కుల పరమేశ్ ఘటనా స్థలికి చేరుకుని కారును అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.